
# అమ్మో... అమ్మదెయ్యం...

కె. ఆదిశేషారెడ్డి




రోజూలాగే మెలుకువ వచ్చింది తనకి. తలెత్తి వాల్‌క్లాక్ వంక చూశాడు. ఆరుగంటలు... ''అమ్మో! ఆరయిందే'' వులిక్కిపడి లేవబోయి, ఆదివారం అని గుర్తొచ్చేసరికి ఆగిపోయాడు. మళ్లీ ముసుగు తన్ని పడుకున్నాడు. కళ్లు మూసుకున్నాడే గాని... నిద్రరావటం లేదు. అయినా లేవబుద్ధేయలేదు.

''అమ్మా! వాడిని నిద్రలేపు'' కంచుకంఠం అరిచింది. అది నాన్న గొంతు. అదేంటో ఆయన గొంతులో ఫ్రీక్వెన్సీ మధురంగా వుండదు. గాఢ నిద్రలో వారైనా వులిక్కిపడి లేవాల్సిందే.

తను మేలుకొనే వున్నాడు కాబట్టి వులిక్కిపడలేదు. మరింత ముసుగు బిగించాడు.

''పోనీలేరా. ఈరోజు ఆదివారం కదా. కాసేపు పడుకోనివ్వు'' బామ్మ అంది. బామ్మంటే.. బామ్మే... బంగారు బామ్మ. యెప్పుడూ తన పార్టీనే.

''అది కాదమ్మా. ఆదివారమైనా ట్యూషన్‌కి వెళ్లాలిగా. త్వరగా లేపు'' మళ్లీ నాన్న గొంతు.



''బామ్మా! రేపు నాకు రెస్ట్ కావాలి. ట్యూషన్‌కి వెళ్లను. యెంచక్కా నీతో కబుర్లు చెప్పుకొంటూ యింట్లోనే వుంటానే.. నాన్నతో సర్దిచెప్పు. అమ్మ భూతం కూడా యింట్లో లేదుగా'' అంటూ పడుకోబోయేముందు తను చెప్పిన మాటలు బామ్మకు గుర్తొస్తున్నాయో.. లేదో, అనుకొనేంతలో.. ''ఈరోజు వాడికి ట్యూషన్ లేదట. రాత్రే చెప్పాడు'' ఠక్కున సమాధానం చెప్పింది బామ్మ. తర్వాత కంచు కంఠం మోగలేదు.

''థ్యాంక్స్ బామ్మా! పొద్దున్నే యెంత స్వీట్ అబద్ధం చెప్పావే. మళ్లీ నీకో స్వీట్ కిస్ యివ్వాలి'' మనసులో అనుకున్నాడు తను.

మొత్తానికి రెస్ట్ ఛాన్స్ కొట్టేశాడు. అమ్మభూతం లేకపోవడం ఈరోజు యెంతో మేలయింది. అమ్మో... అమ్మ వుంటేనా.. ఈ పాటికి తన సీను బాత్‌రూమ్ దాటి, హార్లిక్స్ చేరి వుండేది. అమ్మమ్మకి హెల్త్ బాగలేదంటే రెండు రోజుల క్రితం వూరెళ్లింది. అప్పట్నించి యింట్లో పెత్తనం బామ్మదే.

బామ్మయితే చక్కగా కబుర్లు చెపుతుంది. స్నానం చేసేటప్పుడు, టిఫిన్ తినేటప్పుడు, అన్నం తినేటప్పుడు, పడుకోబోయే దాకా కబుర్లే.. కబుర్లు. బామ్మకెంత తెలుసో.. యెంత జనరల్ నాలెడ్జి వుందని.. , కాకి దగ్గర నుండి రాజ కుమారులు దాకా యెన్నెన్ని కథలో. అబ్బో, భలే చెబుతుంది.

అదే అమ్మయితేనా.. యెప్పుడూ సీరియస్ ఫేస్. ''త్వరగా తెములు. ట్యాంక్‌లో నీళ్లన్నీ అయ్యేదాకా స్నానం చేస్తూంటే.. స్కూల్ బస్ వచ్చి వెళ్లిపోతుంది'' కొంచెం ఆలస్యమైందనుకో ''యేంటా సోకులు, గబగబ బట్టలు వేసుకోలేవూ... అవతల సావిత్రి వాళ్లబ్బాయి గేట్లో కొచ్చి బస్సుకోసం యెదురు చూస్తున్నాడు'' అంటుంది.

టిఫినైనా సరిగా తిననిస్తుందా, ఒకటే నస, సణుగుడు. ''తినటమూ స్లోనే. చదువూ స్లో..నే. ఈసారైనా క్లాస్‌లో ఫస్ట్‌ర్యాంక్ తెచ్చుకో. రవి కంటే నీకు మార్కులు పెరగాలి. వాళ్ల నాన్నేమో గుమాస్తా, మీనాన్నేమో ఆఫీసరు. వాడికంటే తక్కువ మార్కులు తెచ్చుకోవటానికి సిగ్గేయటం లేదూ'' అంటూ రోజూ సాధింపే. అందుకే అమ్మ దేవత అని అందరూ అంటున్నా.. తనకి మాత్రం అమ్మ దెయ్యమే!

''ఒరేయ్ కన్నా! నిద్ర లేచావట్రా'' అంటూ వచ్చింది బామ్మ. అటూ యిటూ కదిలాడు.. లేచాను అనటానికి సిగ్నల్‌గా. పైనున్న దుప్పటి తొలగిస్తూ, ''లేచి ముఖం కడుక్కో.. హార్లిక్స్ యిస్తాను'' అంది.

''యిప్పుడే లేస్తే నాన్న ట్యూషన్ అంటాడు. యింకాసేపు పడుకొంటాను''

''ఈరోజు నీ ట్యూషన్ కాన్సిల్ అయిందని మీ నాన్నతో చెప్పాలే... యికలే'' అంది.

''థ్యాంక్ బామ్మా! యిదిగో యిలా రా'' సీరియస్‌గా పిలిచాడు తను.

దగ్గరకొచ్చింది బామ్మ. యెగిరి బామ్మ బుగ్గ మీద 'కిస్' యిచ్చాడు. ''ఓర్నీ.. చిలిపి సన్నాసీ'' అంటూ బుగ్గ తుడుచుకుంటూ వెళ్లిపోయింది.

తను లేచి బాత్‌రూమ్‌కెళ్లి ముఖం కడుక్కొని, బామ్మ తెచ్చే హార్లిక్స్ కోసం యెదురు చూస్తూ కిటికీలోంచి వీధివంక చూడసాగాడు. అప్పుడే గోపీ, వాడి చెల్లెలు వీధిలో ఎగురుతూ ఆడుకుంటున్నారు. గోపీగాడికంటే తను ఆర్నెల్లు చిన్నట. బామ్మ చెపుతూ వుంటుంది. గోపీ వాళ్లు ఆడుకొంటుంటే తనకూ వెళ్లి ఆడుకోవాలని పిస్తుంది. కాని.. యింట్లో ఒప్పుకోరు. వీధిలో ఆటలాడి యెన్నిరోజులైందో.

గోపీ ఆ వీధిలోనే వున్న గవర్నమెంటు స్కూల్లో చేరాడు. వాడికి ట్యూషన్‌లు లేవు. బడికి సెలవైతే ఆటలాడుకుంటూ వుంటాడు. మరి తనకో.. బిజీ షెడ్యూల్. నిద్ర లేచినప్పటినుంచీ పడుకోబోయేదాకా.. అంతా బిజీనే.

ఒకరోజు గోపీ వాళ్లమ్మతో ''అదేంటి కమలమ్మా! వాడి యీడు పిల్లలంతా కాన్వెంటు వెళ్లి చదువుకుంటూ వుంటే.. నువ్వేమో గవర్నమెంటు స్కూల్లో వేశావు. ట్యూషన్ కూడా పెట్టించలేదు. అట్లా గాలికి తిరుగుతూ వుంటే చదువెలా వస్తుంది. చెడిపోడూ'' అంది అమ్మ.

అయితే దానికి కమలమ్మ మంచి జవాబిచ్చిందిలే. ''ఓయబ్బో.. కాన్వెంటు చదువులు. యేముందమ్మా అక్కడ. అలివిగాని ఫీజులు నొక్కేసి నాలుగు యింగిలీషు మాటలు నేర్పించేస్తారు. నిద్రలేచినప్పటినుంచి పరిగెత్తి పరిగెత్తి అలసి పోవటమేగా. మన ఆత్రం కొద్దీ కాకపోతే మూడేళ్లకి

## డోన్ట్ కిస్!

**ఈ** ఏడాది వరుసగా విరుమాండి (తెలుగులో పోతురాజు), వసూల్‌రాజా ఎంబిబిఎస్ హిట్ కొట్టేసరికి కమల్‌కి మళ్లీ దశ తిరిగింది. హిందీలో సంజయ్‌దత్ చేసిన పాత్రను కమల్ సులభంగానే చేస్తాడని అందరికీ నమ్మక మున్నా సినిమా భారీ హిట్ కొడుతుందని ఎవరూ వూహించలేకపోయారు. ఇది హిట్ కావడానికి కారణం కమల్ అన్ని శాఖల్లోనూ వేలుపెట్టకుండా కేవలం నటనకే పరిమితం కావడమేనని సినీ విమర్శకులు అంటున్నారు. అంతేకాకుండా హీరోయిన్‌ని కమల్ ముద్దుపెట్టుకునే సీన్ లేకపోవడం కూడా ఇంకో కారణమని అంటున్నారు. ఈ ముద్దుల వ్యవహారం జనాలకు అంతగా బోర్ కొట్టింది మరి! ఈ విజయోత్సవంతో కమల్ ఏకంగా ఒక స్పానిష్ సినిమా కొని తమిళంలో తీయబోతున్నాడు. ఇంగ్లీష్ రీమేక్ కాబట్టి ముద్దూముచ్చటకేం కొదవుండదు మరి!

స్కూల్లో పడేస్తున్నాం. అయినా రాజమ్మగారూ... ఆ పిల్లల్ని చూడు యిసుకలో యెలా ఆడుకుంటున్నారో. వాళ్లది ఆడుకునే వయసమ్మా. ఇప్పుడు కాకపోతే మరెప్పుడు ఆడుకొంటారు. మనం వున్నాం.. యిప్పుడు అలా ఆట్లాడుకోగలమా? అందుకే అంటారు.. యే వయసులో ఆ ముచ్చట అని'' కమలమ్మ అన్నప్పుడు అమ్మ ముఖం యెలా మాడిపోయిందో తనకి యింకా గుర్తుంది. తనను బరబరా యీడ్చుకొచ్చి నీళ్లు పోసి, టేబుల్స్ చదవమంది. తనకీ తిక్కరేగి మొండికేసి నాలుగు తన్నులు తిన్నాడు.

''కన్నా! యిదిగోమ్మా హార్లిక్స్'' బామ్మ పిలుపుతో తను యీలోకంలోకి వచ్చాడు. బామ్మ కనిపెట్టింది... తను కిటికీలోంచి గోపీని చూడటం.

''బామ్మా! నేనూ వెళ్లి ఆడుకొంటానే''

''అలాగే ఆడుకుందువుగాన్లే. ముందు హార్లిక్స్ తాగు. స్నానం చేసి టిఫిన్ తిను. ఈలోగా మీ నాన్న బయటకు వెళ్తాడు. అప్పుడెళ్ళి ఆడుకుందువుగాని'' అంది.

తను తలూపి హార్లిక్స్ అందుకున్నాడు.

టిఫిన్ తిన్నాక, నాన్న యెప్పుడు బయటకి వెళతాడా అని యెదురు చూస్తూ పుస్తకం పట్టుకుని చదువుతున్నట్లు యాక్షన్ చేస్తున్నాడు తను. తొమ్మిది గంటల తర్వాత ఆయన బండి తీసుకుని బయటకు వెళుతూ'' సెలవుకదాని కబుర్లు, టీవీతో కాలక్షేపం చేయక బుద్ధిగా చదువుకో'' అన్నాడు.

తనకి ఒళ్లు మండింది. యెప్పుడూ చదువు.. చదువు.. ఒకటే నస.

నాన్న అటు వెళ్లగానే తను మెల్లగా వీధిలోకి నడిచాడు. గోపీని పిలిచి ''ఆడుకుందామా'' అన్నాడు. గోపీ ఆశ్చర్యపోయి తలూపాడు. యిద్దరూ ఆట మొదలుపెట్టారు. కాసేపు తను బ్యాటింగ్, గోపీ బౌలింగ్. మళ్లీ తను బౌలింగ్, గోపీ బ్యాటింగ్. యిద్దరికీ ఫీల్డింగ్ పాపం గోపీ చెల్లెలే!

టైము తెలియలేదు. యెంతసేపు ఆడుకున్నారో. అదో చెప్పలేని సంతోషం. అనుభూతికి అందని ఆనందం.

''రేయ్!'' కంచు కంఠం పిలిచింది.. కాదు అరిచింది.

తను వులిక్కి పడ్డాడు. యింతవరకూ పొందిన ఆనందం నీరుగారిపోయింది. గోపీకి 'బై' చెప్పి యింట్లోకి అడుగు పెట్టాడో లేదో ''చాన్స్ దొరికింది కదాని ఆటలకెళ్లావా. ఆ చేతులు, చొక్కా, ప్యాంటు చూడు యెలా మట్టికొట్టుకున్నాయో! యిప్పుడు గాని మీ అమ్మ చూసిందనుకో తన్ని తగలేసి వుండేది'' అరిచాడు నాన్న.

తనేం మాట్లాడలేదు. బామ్మ వంక చూశాడు. బామ్మ 'సైలెంట్' సిగ్నల్ యిచ్చింది. మౌనంగా బాత్రూమ్‌లో దూరి, బట్టలు విప్పేసి, స్నానం చేసి, వేరేవి వేసుకుని డైనింగ్ టేబుల్ దగ్గరికొచ్చాడు.

''ఈరోజు ట్యూషన్ లేదట్రా నీకు'' కంచు కంఠం మోగింది.

తనకి గుండె అదిరింది. ''లేదని చెప్పాగా'' బామ్మ అందుకుంది.

''నువ్వూరుకోవే. వేలెడంత లేడు యెంత తెలివిగా ట్యూషన్ యెగ్గొట్టాడు. వాళ్ల సార్ యిందాక సెంటర్లో కనిపించినప్పుడు అడిగాడు.

నెత్తిన పిడుగు పడింది. ఒక్కసారి అబద్ధం చెపితేనే అది యింత అర్జెంట్‌గా పేలుతుందని అనుకోలేదు తను.

''అమ్మా! నీ కోడలిని రమ్మని ఫోన్ చేస్తానే'' భోజనం తిని లేస్తూ అన్నాడు నాన్న.

''మీ అత్తకి నయమైందట్రా''

''ఆమెకి నయమైందాకా కూర్చుంటే వీడు పాడైపోతాడు. నీ మాట వినడు. నాకా తీరికుండదు. అందుకే వెంటనే ఫోన్ చేసి రమ్మంటాను''

నాన్న కంఠంలోని తీవ్రతను పసికట్టిన బామ్మ మౌనంగా వుండిపోయింది.

ఆ రాత్రి పడుకోబోయే ముందు తను బామ్మతో ''బామ్మా! రేపు అమ్మదెయ్యం వచ్చేస్తుందా?'' అన్నాడు.

''తెలియదురా కన్నా! మీ నాన్న ఫోన్ చేశాడో లేదో. అదే ఆలోచన పెట్టుకోక ప్రశాంతంగా నిద్రపో'' జోకొడుతూ అంది బామ్మ.

''బామ్మా! అమ్మ రాకుంటే బాగుండు''

''తప్పు కన్నా! అలా అనకూడదు. నువ్వంటే దానికి ప్రాణం. తనకి లేక లేక పుట్టావురా. పెళ్లయిన పదేళ్లకు. మళ్లీ పుట్టలా..! అందుకే నీ మీద అంతప్రేమ. వాళ్లు నీమీద శ్రద్ధ చూపించేది ఆ ప్రేమతోనే''

''బామ్మా! ప్రేమంటే యిదేనా. నా మనసుకు యిష్టం లేని దానిని బలవంతంగా చేయించడం, యిష్టం వున్న వాటిని వద్దనడం, చదువు కావాలని నాకు మాత్రం వుండదా. యెప్పుడైనా ఆడుకోవాలనిపించదా. ఆడుకోవటమే తప్పంటే యెలా బామ్మా'' తనలో తెలియని ఆవేదన కట్టలు తెంచుకుంది. గుండెలు బరువెక్కాయి. కళ్లలోని నీటి సుడులు ధారగా బయటకు వుబుకుతున్నాయి.

''నిజమే కన్నా. నీ బాధ వాస్తవమే. కాని మీ అమ్మ నిన్నో గొప్పవాడిగా పెంచాలనీ, గొప్పవాడిగా చూడాలని కోరికతో వుంది. ఆమె తన కోరిక ముందు యివేమీ గమనించటం లేదు'' అనునయిస్తూ అంది బామ్మ.

''నువ్వెంతయినా చెప్పు బామ్మా నాకు తెలియని బాధ యిదొక్కటే. అమ్మకి ప్రేముంది. అడిగినవన్నీ తీసి యిస్తుంది. కావాలన్నవన్నీ చేసి పెడుతుంది. ఒక్క... ఆటల విషయంలోనే యిబ్బంది పెడుతుంది'' వెక్కిళ్ల మధ్య అన్నాడు తను. బామ్మ ఓదార్చి నిద్రపుచ్చసాగింది. బామ్మ పక్కలో పడుకుని యెప్పటికో నిద్రలోకి జారుకున్నాడు.

''ఒరేయ్ కన్నా! తెల్లారింది నాయనా'' అంటూ చిన్నగా తట్టి పిలిచింది బామ్మ.

దుప్పటి తొలగించి వాల్‌క్లాక్ వైపు చూశాడు. ఆరుగంటలు దాటింది.

''బామ్మా! బడలికగా వుందే! డాడీ యెక్కడ?'' అని అడిగాడు.

''తెలియదురా. తెల్లారిజామున లేచి బైక్ తీసుకుని వెళ్లాడు'' అనింది.

అంతలో వాకిలిముందు బైక్ ఆగిన చప్పుడు వినిపించింది. ఇంట్లోకొస్తున్న అడుగుల శబ్దం.. దుప్పటి పూర్తిగా తొలగించాడు.

''అదిగో.. రాజీ! వాడింకా నిద్రలేవనేలేదు'' కంచు కంఠం మ్రోగింది.

''అమ్మో... అమ్మ దెయ్యం వచ్చేసింది!'' అనుకుంటూ బెడ్‌మీదినుండి దూకి, బాత్రూమ్‌లో దూరి తలుపేసుకున్నాడు తను. అంతే.. టైం టేబుల్ మళ్లీ మొదలైంది.

★

